


# దేవుడి ఏజెంటు

-రావి.ఎస్.అవధాని

**మ**హాదేవమ్మ మహా భక్తురాలు. రోజూ ఉదయాన్నే లేచి స్నానం చేసి దేవుడికి దీపారాధన, పూజ చేయందే మరే పనీ చెయ్యదు. నిత్యం లలితా సహస్రం, లక్ష్మీ సహస్రనామం, వేంకటేశ్వర సుప్రభాతం ఎంతో నిష్ఠతో పారాయణ చేస్తుంది. మహాదేవమ్మ వయస్సుపైబడ్డ మనిషి కాదు. మూడు పదుల వయస్సు నిండని మగువ.

మహాదేవమ్మ భర్త సుందరశివయ్య. అతను గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా. ఏ విధమైన పైరాబడి లేని సీటు అతనిది. చేతికి వచ్చిన జీతంతో తృప్తిపడే మనిషి అతను. జల్సాలు, షోకులు, షికార్లజోలికి ఎన్నడూ పోడు. అతనికి అన్నివిధాలా తగిన ఇల్లాలు మహాదేవమ్మ. దుబారా ఖర్చులు చేయకుండా ఎంతో పొందికగా, సమర్థవంతంగా సంసారం చక్కదిద్దుతోంది.

వారి ఏకైక సంతానం శ్రీనివాస్. శ్రీనివాస్‌కి ఆరు సంవత్సరాల వయస్సు. వయస్సుని మించిన తెలివితేటలు గల చురుకైన కుర్రాడు. రెండో తరగతి చదువుతున్నాడు. ఏ విషయమైనా ఒక్కమారు చెప్తే చాలు, విని జ్ఞాపకముంచుకుంటాడు. బుద్ధిమంతుడు. క్లాసులో ఫస్ట్‌ర్యాంక్ తెచ్చుకుంటున్నాడు.

శ్రీనివాస్‌కి కూడా ఆ పిన్న వయస్సులోనే దైవభక్తి అలవడింది. ఉదయాన్నే తన తల్లితోనే నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి పట్టులాగు తొడుక్కుని దేవుడిముందు.. మందిరం ముందు కూర్చుంటాడు. తల్లి నేర్పిన శ్లోకాలు, పద్యాలు గడగడా చదువుతాడు. తల్లి పూజ ముగిసేవరకూ చేతులు కట్టుకుని కూర్చుంటాడు. హారతి కళ్లకద్దుకుని దేవుడికి నివేదన చేసిన బెల్లంముక్కో, పటిక పంచదారో, ఎండుద్రాక్షపండో ప్రసాదం చేతిలో వేస్తే కళ్లకద్దుకుని నోట్లో వేసుకుని బయటకు వస్తాడు. మడిలాగు మార్చుకుని స్కూలు యూనిఫారం వేసుకుని టిఫిన్ తిని పాలు తాగి స్కూల్‌కి వెళ్తాడు.

నాలుగు నెలల క్రితం శ్రీనివాస్‌కి జబ్బుచేసింది. రెండు రోజులు పిల్లవాడికి ఒంటిమీద తెలివి లేదు. భార్యాభర్తలు ఎంతో భయపడ్డారు. డాక్టర్ వచ్చి చూసి ఇంజక్షన్ ఇచ్చి వెళ్లాడు. మహదేవమ్మ ఆ రెండురోజులూ భోజనం చెయ్యలేదు. తల్లి మనసు ఎంతో తల్లడిల్లింది.

"స్వామీ! ఏడుకొండలవాడా! పిల్లవాడికి జబ్బు నయమైతే నీ కొండకు వచ్చి నూటొక్క రూపాయలు నీ హుండీలో వేస్తాను!" అని మొక్కుకుని పసుపుగుడ్డలో నూటొక్క రూపాయలు మూటకట్టి దేవుని మందిరంలో ఉంచింది.

ముడుపు ప్రభావమో, లేక డాక్టరుగారి మందు ప్రభావమో తెలియదు గానీ, శ్రీనివాస్‌కి జబ్బు తగ్గి మామూలు మనిషి అయ్యాడు. మహదేవమ్మ ఆనందానికి అంతు లేదు. అయితే నాలుగు నెలలు గడిచినా ఏడుకొండలవాడి కొండకెళ్లడం పడలేదు.

ప్రతి నెలా ఆమె భర్తకు దేవుడి ముడుపు విషయం జ్ఞాపకం చేస్తూనే ఉంది. కానీ సుందర శివయ్యకు మాత్రం మొక్కుబడి చెల్లించే దారి కనిపించలేదు. తిరుపతి ప్రయాణానికి ముగ్గురికీ కనీస ఖర్చు ఈ రోజుల్లో పదిహేనువందల రూపాయలవుతుంది. అంత డబ్బు ఎక్కడనుండి తేవాలో అర్థంకాక ప్రయాణం వాయిదా వేస్తున్నాడు.

భర్త రాబడి, తమ ఆర్థిక పరిస్థితి తెలుసు కనుక మహదేవమ్మ భర్తను ఒత్తిడి చెయ్యలేకపోతోంది. అయితే ఏడుకొండలవాడు-వడ్డీకాసులవాడు కనుక మొక్కుబడి చెల్లించనందుకు అపరాధవడ్డీక్రింద ప్రతి నెలా ఒక రూపాయి వేరే పసుపు గుడ్డలో మూటకట్టి దేవుడి మందిరంలో ఉంచుతోంది.

శ్రీనివాస్‌కి ఏమాత్రం నలతగా ఉన్నా కనీసం జలుబు చేసినా, అది మొక్కుబడి ప్రభావమేమోనని భయపడుతోంది.

ఊళ్లోగల శంకరమఠంలో తరచు పీఠాధిపతులు వచ్చి మహారుద్రయాగం, కోటి బిల్వార్చన, కోటి కుంకుమార్చనలాంటివి జరిపిస్తూంటారు. అటువంటి కార్యక్రమాలకు సుందర శివయ్య భార్యను, కొడుకుని తీసుకువెళ్లి చూసి వస్తూంటాడు.

ఈ పర్యాయం శంకరమఠంలో సంక్రాంతి ముందు చండీయాగం జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమం చూడటానికి మహదేవమ్మ కొడుకుని తీసుకుని వెళ్లింది.

హోమగుండంలోని మంటల్లో నెయ్యి, హవిస్సూ, నవధాన్యాలూ, పట్టువస్త్రాలు మొదలైన సామగ్రి వెయ్యడం చూశాడు శ్రీనివాస్.

"మంటల్లో వేసిన వస్తువులు కాలిపోతాయి కదా? మరి పీరు పట్టుబట్టలూ అవీ మంటల్లో అలా పడేస్తున్నారెందుకు అమ్మా?" అని ప్రశ్నించాడు.

కొడుకు వేసిన ప్రశ్నకు చిరునవ్వు నవ్వింది మహదేవమ్మ.

"అది హోమగుండం! అందులోవాటిని మంటలు, నిప్పులు అనకూడదు. అగ్నిహోత్రుడు అనాలి. అగ్నిహోత్రుడు కూడా దేవుడే! అతను దేవతలందరికీ రాయబారి. మనం ఏ దేవుడిని తల్చుకుని అగ్నిహోత్రంలో ఏ వస్తువునైతే వేస్తామో ఆ వస్తువులు అగ్నిహోత్రుడు జాగ్రత్తగా తీసుకువెళ్లి ఆ దేవుడికి అందిస్తాడు!" అంది.

"అలాగా!" అన్నాడు ఆశ్చర్యంగా.

కొడుకు ఏ విషయం అడిగినా వాడికి అర్థమయ్యేటట్టు ఎంతో ఓపికతో చెప్తుంది మహదేవమ్మ.

000



భోగిపండగనాడు శ్రీనివాస్ ఉదయాన్నే లేచి తలంటుపోసుకుని కొత్తబట్టలు వేసుకుని వీధిలో పిల్లలంతా వేసిన భోగిమంట చూడటానికి వెళ్లాడు. మహదేవమ్మ స్నానం చెయ్యడానికి బాత్రూమ్‌లోకి వెళ్లింది. ఆమె స్నానం చేసి బయటకు వచ్చేసరికి వంటింటి గుమ్మం దగ్గర కొడుకు పట్టులాగూ వేసుకుని నిల్చుని ఉండటం చూసి ఆశ్చర్యపోయింది.

"ఏరా! భోగిమంట చూడటానికి వెళ్లలేదా? కొత్త బట్టలు అప్పుడే ఎందుకు మార్చేశావు?" అని అడిగింది.

"దేవుడికి మన ముడుపులు మడి లాగూ వేసుకుని వెళ్లి ఇచ్చివస్తున్నాను. ఇదుగో, ప్రసాదం కూడా తెచ్చాను!" అంటూ పిడికిలితో తెచ్చిన మసి బూడిదను చూపించాడు సంతోషంతో.

"ఏమిట్రా నువ్వంటున్నది? నాకేం అర్థం కావడంలేదు. మడి లాగూతో వెళ్లి దేవుడికి ముడుపులివ్వడమేమిటి?"

"అదేనమ్మా... నాకు జబ్బు చేసినప్పుడు ఏడుకొండలవాడికివ్వాలని పసుపు గుడ్డలో మూటకట్టి దేవుడి మందిరంలో ఉంచావు కదా! అది దేవుడికి త్వరగా ఇవ్వాలి. లేకుంటే కోపం వస్తుందన్నావు. మరి దేవుడి ఏజెంటు అగ్నిహోత్రుడని చెప్పావు కదా! ఏ దేవుడికివ్వాల్సిన వస్తువైనా అతనికిస్తే అతను ఆ వస్తువును జాగ్రత్తగా ఆ దేవుడికి అందజేస్తాడని చెప్పావు కదా! అందుకని నువ్వు ఏడుకొండలవాడికోసం కట్టిన ముడుపును ఏజెంట్ అగ్నిహోత్రుడికిచ్చి దానిని జాగ్రత్తగా ఏడుకొండలస్వామికివ్వమని చెప్పాను!" అన్న కొడుకు మాటలకు మూర్ఛపోయింది మహదేవమ్మ. ■

భోగిపండగనాడు శ్రీనివాస్ ఉదయాన్నే లేచి తలంటుపోసుకుని కొత్తబట్టలు వేసుకుని వీధిలో పిల్లలంతా వేసిన భోగిమంట చూడటానికి వెళ్లాడు. మహదేవమ్మ స్నానం చెయ్యడానికి బాత్రూమ్‌లోకి వెళ్లింది. ఆమె స్నానం చేసి బయటకు వచ్చేసరికి....